క్లుప్తంగా

ఘనంగా భావప్రచార పరిషత్ భక్త సమ్మేళనం

కాళ్ల: రామకృష్ణ సేవాసమితి (కాళ్ళకూరు), వివేకానంద సేవాసమితి (పెదఅమీరం - భీమవరం) సంయుక్త ఆధ్వర్యంలో రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్ భక్త సమ్మేళనం శనివారం కాళ్ల మండలం ప్రాతాళ్ళ మెరక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రెండవరోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామీ భోదమందయాజీ(హైదరాబాద్), స్వామి అనుపమానందజీ (కడప), స్వామి స్వసంవేద్యనందజీ, స్వామి వినిశ్చిలానందజీ, స్వామి సేస్యనందాజీ, స్వామిరఘు నాయక నందాజీ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. వేగిరాజు శివవర్మ, వేగేశ్న సోమరాజు, కేవీకే రాజు, ఉపాధ్యాయులు, భక్తులు పాల్గొన్నారు.

భీమవరం వెళ్లి ఆన్‌లైన్ 'చేయూత'


తాళ్ల భ్రమరాంబిక, భీమవరం వృద్ధాశ్రమం

ఆకివీడు: తాళ్ల భ్రమరాంబిక అనే మహిళను చూసేవారు ఎవరూ లేకపోవడంతో గత ఏడాది స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరంలోని జడ్డు బ్రహ్మాజీ వృద్ధాశ్రమంలో చేర్పించారు. స్థానిక సాలిపేటలో నివసిస్తున్న భ్రమరాంబిక, భర్త సత్యనారాయణకు 25 ఏళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. కరోనాతో భర్త సత్యనారాయణ చనిపోవడంతో ఆమె అనాథగా ఉంది. మూడేళ్లుగా చేయూతను పొందుతున్న ఆమెకు ఆన్‌లైన్ (ఈకేవైసీ) చేయించేందుకు వలంటీర్ నీళ్ల కళ్యాణి శనివారం భీమవరంలోని వృద్ధాశ్రమానికి వెళ్లి వేలిముద్ర సేకరించారు. ఈ ఏడాది చేయూత పొందేందుకు ఆమెకు అవకాశం కల్పించారు. ఆమెకు రెండేళ్లుగా వితంతు పింఛన్ అందుతోంది. ఆమెకు సహకారంగా స్థానిక వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ యర్రా కేశవ సేవలందిస్తున్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు


ఉండిలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న గాయత్రి

ఉండి: మహిళలు తమ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా న్యాయవాదులు జీ గాయత్రి,జీ ఉమాదేవి అన్నారు. శనివారం ఉండి మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అనేది చాలా ప్రయోజనమని అన్నారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వీ పీ బాలాజీ,ఏపీఎం శేషవేణి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎండీఎం, ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్లు కె కృష్ణారావు, జి చిన్నయ్య చెప్పారు. శనివారం భీమవరం పీఎస్ఎమ్ స్కూల్లోని న్యాప్‌కిన్స్ నాణ్యతను కమిటీ సభ్యులు కృష్ణారావు, చిన్నయ్య, ఉండి ఎంఈవో బి జ్యోతి, చినఅమిరం, భీమవరం పీఎస్ఎమ్ హైస్కూల్ హెచ్ఎంలు పి.అనురాధ, జె.సుధారాణి, పి.చిట్టికుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు, చిన్నయ్య మాట్లాడుతూ యుక్త వయస్సు బాలికలకు ప్రభుత్వం స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 271 పాఠశాలల్లోని 30 వేలకు పైగా విద్యార్థినులకు నెలకు 3 లక్షల చొప్పున 4 నెలలకు అవసరమైన న్యాప్‌కిన్స్ ఆయా పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులతో పంపిణీ చేయిస్తున్నట్లు వివరించారు.

సీనియర్ ఎలక్ట్రీషియన్లకు సత్కారం


సీనియర్ ఎలక్ట్రీషియన్లను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

భీమవరం: భీమవరం మండలాల ఎలక్ట్రికల్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన ఎలక్ట్రీషియన్స్ డే కార్యక్రమంలో శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబళ్ళ శ్రీనివాసరావు, కింతాడ కృష్ణమోహన్ పాల్గొన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, సీనియర్ ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జీవీ నర్సింహ రాజు, కార్యదర్శి కట్టా శ్రీనివాస్‌గౌడ్ , కోశాధికారి సుంకర ఆంజనేయ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

- జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి
- జిల్లా స్థాయి పోటీలకు విస్తృత ఏర్పాట్లు


అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి

భీమవరం: జనవరి 31వ తేదీ నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ఇదే స్ఫూర్తితో విజయవంతం చెయ్యాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా జాయింటు కలెక్టరు చాంబరులో జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలపై ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, సంబంధిత అధికారులతో జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్ఫూర్తితో జిల్లా స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో పాల్గొన్న క్రీడాకారులందరూ జిల్లా స్థాయిలో అందరూ పాల్గొనేలా చూసి, పెద్ద ఎత్తున ప్రజలు, క్రీడా అభిమానులు పాల్గొనేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న క్రీడా కార్యక్రమాలను తెలుసుకుని, అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు దిశా నిర్దేశం చేసారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వం వివిధ దశల్లో క్రీడా పోటీలను నిర్వహించుటలో అధికారులు చురుకై న పాత్ర పోషించాలన్నారు. తాగునీరు, మెడికల్ క్యాంపులు, ఫస్టు ఎయిడ్ బందాలు, తగినన్ని క్రీడా సామగ్రి, తదితరు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. క్రీడాకారులు గ్రౌండు దగ్గరలో నివాసంగా ఉండాలని, అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించి, వసతి, అల్పాహారం, భోజన సదుపాయం లోటు లేకుండా చూడాలన్నారు. క్రీడా పోటీల వివరాలు సోషల్ మీడియా, లోకల్ ఛానెల్స్, ప్రెస్ ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమాలు ముందుగానే అందరికీ తెలిసేలా వార్డు, గ్రామ సచివాలయంలో ప్రదర్శించాలన్నారు. సంబంధిత అధికారులు క్రీడల ఏర్పాట్లపై నిమగ్నమై ప్రతి రోజు జరిగే క్రీడలు విజయవంతం చెయ్యాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెను వెంటనే జిల్లా అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలని జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, డీఎల్డివో ఏవీ అప్పారావు, తహసీల్దారు వై రవికుమార్, పురపాలక సంఘ కమీషనరు యం శ్యామల, ఎంపీడీవో కె వెంకటలక్ష్మి, డీఎస్డీవో యం రాజేష్, పీడీ, పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ యండీ కుదుష్, యస్‌జీయఫ్ సెక్రటరీ పీఎస్‌యన్ మల్లేశ్వరరావు, చీఫ్ కోచ్ డా.యం దుర్గారావు పాల్గొన్నారు.

ఎస్‌ఏటీ టాలెంట్ టెస్ట్‌లో ఆదిత్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఎస్‌ఏటీ టాలెంట్ టెస్ట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భీమవరం: ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎస్ఏటీ టాలెంట్ టెస్ట్‌లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు పలు ర్యాంకులు సాధించారని స్కూల్ డైరెక్టర్ ఎస్‌వీపీకేహెచ్‌జీ కృష్ణంరాజు శనివారం తెలిపారు. పోటీల్లో తమ విద్యార్థులు అజయ్‌జైసార్య, ఎంజిల్, లోకేశ్వర్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించగా వి నీలశృతి మూడవ ర్యాంకు సాధించినట్లు వివరించారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులను కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్, బి యుగసుధ, కె సత్యనారాయణ అభినందించారు.

వెంకన్న ఆలయంలో కోలాట నృత్య ప్రదర్శన

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ధర్మ ప్రచారంలో భాగంగా శనివారం కోలాటం నృత్య ప్రదర్శన నిర్వహించారు. చినఅమిరం శ్రీ పద్మావతి వెంకటేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల కోలాట నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శనివారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సాయంత్రం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణసేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం టూ టౌన్‌లోని కొవ్వాడ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడం కోసం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు.

ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంవీఐలు


అవార్డులు అందుకున్న రవాణా శాఖ ఎంవీఐలను అభినందిస్తున్న డీటీవో ఉమామహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదగా అవార్డులు అందుకున్న రవాణా శాఖ ఎంవీఐలను జిల్లా రవాణా శాఖ అధికారి టి. ఉమామహేశ్వరరావు అభినందించారు. రవాణా శాఖలో ఎంవీఐలు (మోటార్ హెవికల్ ఇన్‌స్పెక్టర్లు)గా పనిచేస్తున్న వెంకటరమణ, (భీమవరం) ప్రసాద్, (భీమవరం), సంజీవ్‌కుమార్ (తణుకు) అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీటీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేస్తూ గుర్తింపు తెచ్చుకుని కలెక్టర్ చేతుల మీదగా ముగ్గురు ఎంవీఐలు అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం

కలెక్టరు పి.ప్రశాంతి



'ఎట్ హోమ్' కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతి, అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టరు బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఆహ్లాదకరమైన వాతావరణంలో కన్నుల పండువగా 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఏర్పాటు చేసిన తేనీటి విందులో వివిధ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారుల సమన్వయం, కృషి ఫలితంగా జిల్లా సుసంపన్నంగా ఉందన్నారు. జిల్లాలో అన్ని రంగాల్లో అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయని అభినందనలు తెలియజేశారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భవిష్యత్తులో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లాను అభివృద్ధిలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని కలెక్టరు అధికారులను కోరారు. అనంతరం కార్యక్రమంలో వీణా వాయిద్యం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టరు వారిని అభినందించి జ్ఞాపికలు బహూకరించారు. అధికారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. అధికారుల నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకున్నాయి. కలెక్టర్ పి.ప్రశాంతి అన్ని శాఖల అధికారులను ఆప్యాయ పలకరించారు. నోరూరించే వివిధ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఎస్పీ యు.రవి ప్రకాష్, జాయింటు కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ ఎటీవీ రవికుమార్, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణకు ప్రధాన సమన్వయకర్తగా తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ వ్యవహరించారు.

శంకర మఠం రోడ్డులో రాకపోకలకు అనుమతి


భీమవరంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: భీమవరం పట్టణంలోని రెస్ట్‌హౌస్ రోడ్డులోని శంకర మఠం వద్ద రూ. 88 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డు, కల్వర్టులపై రాకపోకలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో నిర్మాణంలో ఉన్న రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. నాలుగున్నర ఏళ్లుగా భీమవరంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్లతోపాటు అవసరమైన చోట కల్వర్టులను నిర్మించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి. సంక్షేమమే లక్ష్యంగా పాటుపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈ త్రినాథరావు, మున్సిపల్ డిఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి


మహదేవపట్నంలో ఉచిత కంటివైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉండి: సున్నితమైన అవయవాలైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉత్తర అమెరికా తెలుగు సంఘ ప్రతినిధులు శ్యాం మద్దాలి, ప్రేమ్ కలిదిండి అన్నారు. శనివారం మండలంలోని మహదేవపట్నంలో ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, చింతలపాటి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో రాజమండ్రి గౌతమి ఐ ఇనిస్టిట్యూట్ వారు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామంతో పాటు సమీపంలోని చిలుకూరు, వెలివర్రు, ఎన్నార్పీ అగ్రహారం నుంచి 200 మంది రోగులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఆపరేషన్లు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామని నిర్వాహకులు తెలిపారు. ఉప సర్పంచ్ సుబ్బరాజు తదితరులు ఉత్తర అమెరికా తెలుగు సంఘ ప్రతినిధుల సేవలను అభినందించారు.

రైతు నాయకుడు మురళీరామరాజుకు సత్కారం


భీమవరంలో కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా సత్కారం పొందుతున్న మురళీరామరాజు

భీమవరం: రైతులకు దుక్కదాయినిగా మారిన మొగదిండి, బొండాడ డ్రెయిన్ల ప్రక్షాళనకు కృషి చేసిన రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజును గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి సత్కరించారు. మురళీరామరాజును దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ జిల్లాలోని మంత్రులు కారుమూరి వెంకటనాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రోత్సాహం కలెక్టర్ ప్రశాంతి సహకారంతో డ్రెయిన్స్ పక్షాళన చేయించినట్లు తెలిపారు. అవార్డునందుకున్న మురళీరామరాజును చినఅమిరం, వేంపాడు, రాయలం, ఈలంపూడి, అనాకోడేరు, సీసలి, బొండాడ తదితర గ్రామాల రైతులు అభినందించారు.

పంచాయతీ చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు


పెన్నాడ తామర చెరువును పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): పెన్నాడ అగ్రహారం గ్రామ పంచాయతీకి చెందిన 4.76 ఎకరాల తామర చెరువును బయట ప్రాంతానికి చెందిన కొంత మంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని శనివారం కలెక్టర్ ప్రశాంతికి గ్రామ సర్పంచ్ చిల్లా అనుషా, ఎంపీటీసీలు, మహిళలు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి జిల్లా పంచాయతీ అధికారి, పాలకోడేరు తహసీల్దార్ విచారణ చేపట్టాలని ఆదేశించారు.

తామరచెరువును పరిశీలించిన ట్రైనీ కలెక్టర్, డిపిఓ

పాలకోడేరు: పాలకోడేరు మండలం పెన్నాడలోని తామర చెరువును అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని కోరుతూ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం స్థానిక సర్పంచ్ చిల్లా అనూష ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. తామరచెరువును కొందరు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై కలెక్టర్ పి. ప్రశాంతికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి మల్లికార్జునరావు స్థానిక అధికారులతో కలిసి తామరచెరువు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ రికార్డుల్లో తామర చెరువు ప్రభుత్వ ఆస్తిగా ఉందని తెలిపారు. దీని పరిరక్షణకు పంచాయతీ అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని డీపీఓ స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ ఐ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి కె లక్ష్మి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు
- పెదఅమిరంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు


పీవీఎల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మోషేన్ రాజు, శ్రీనివాసరాజు




పెదఅమిరంలో పీవీఎల్, మంత్రి కారుమూరిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు
పీవీఎల్‌కు కేక్ తినిపిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, పుష్పగుచ్ఛం అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

కాళ్ల/ఆకివీడు: పశ్చిమగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పుట్టినరోజు వేడుకలు పెదఅమిరం పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, గాదిరాజు సుబ్బరాజు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ సమక్షంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి పీవీఎల్‌కు తినిపించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పీవీఎల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీవీఎల్‌ను పలువురు నాయకులు గజమాలతో సత్కరించారు. నియోజవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకుల ప్రోత్సాహంతో ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స ప్రసాదరాజు,సాగిరాజు హరివర్మ, కొత్తపల్లి రమేష్ రాజు, ఆకివీడు జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, యండగండి శ్రీనివాసరాజు, రణస్థుల మహంకాళి, ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, కటారి జయలక్ష్మి, ఇందుకూరి శ్రీహరి రాజు, భూపతి చంటి రాజు, ఏఎంసీ చైర్మన్లు షేక్ రసూల్ బేబీ, దంపతులు బొక్కా వెంకటేశ్వర్లు, కనుమూరి ఆనందవర్మ, మండల కన్వీనర్లు గణేశ్న రాంబాబు, పెన్మెత్స ఆంజనేయరాజు, కటిక శ్రీదేవి, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌ను ఆకివీడు మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, గజమాలతో ఆయనను సత్కరించారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మోటుపల్లి గంగాధరరావు, కనుమూరి ఆనంద వర్మ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే. రసూల్ బీబీ, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, కఠారి రామకృష్ణ, కేశవరావు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఆకివీడు: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ పుట్టిన రోజు సందర్భంగా భీమవరం వృద్ధాశ్రమంలో 110 మంది వృద్ధులకు శనివారం ఆకివీడు మండల సేవాదళ్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. సేవాదళ్ మండల కమిటీ అధ్యక్షుడు యర్రా కేశవ ఆధ్వర్యంలో నాయకులు సమయమంతుల రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకోడేరు మండలంలో..

పాలకోడేరు: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌కు శనివారం పాలకోడేరు మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, జెడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీ తులసి, ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్ర రాజు, గుండు నాగేశ్వరరావు, సర్పంచులు ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు

ఆలయాలను సందర్శించిన దేవదాయశాఖ కమిషనర్


దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు మావుళ్లమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం మావుళ్ళమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరికి ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ డీ.సీ (విజయరాజు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు ముత్యాల రామారావు, రామాయణం సత్యనారాయణ, చెల్లంగి శేషగిరి పాల్గొని శేష వస్త్రం ప్రసాదాలు అందజేశారు. గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి వార్లను రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనరు యస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రావకృష్ణ, ఈఓ డి.రామకృష్ణం రాజు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో పెదతాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలకు 14 ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన గన్నాబత్తుల కుటుంబానికి చెందిన గన్నాబత్తుల పెదతాత విగ్రహాన్ని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పెదతాత కుటుంబ సభ్యులు ప్రకటించారు. శనివారం కుటుంబ సభ్యులు భీమవరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో కళాశాలలో ఏర్పాటుచేసిన చిన్న విగ్రహాన్ని తొలగించడంతో తమతోపాటు అనేక మందికి తీవ్ర మనస్తాపం కలిగిందని వారన్నారు. దీనికి కళాశాల యాజమాన్యం స్పందించి క్షమాపణ చెప్పినట్టు వారు తెలిపారు. సమావేశంలో గన్నాబత్తుల శ్రీనివాస్, డీఎన్నార్ కళాశాల పాలకవర్గ సభ్యుడు గన్నబత్తుల కుమార్, యర్రా శేషు, వడుపు గోపి, పులఖండం కోటేశ్వరరావు, టీవీవీ ప్రసాద్, పోశంశెట్టి సతీష్ పాల్గొన్నారు.

పాస్టర్ విల్సన్‌రాజు మృతి

ఉండి: సీనియర్ పాస్టర్ రెవరెండ్ థోమస్ విల్సన్ రాజు(65) శనివారం మృతి చెందారు.లూథరన్ చర్చ్ పాస్టర్‌గా అనేక ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సేవలు అందించిన విల్సన్‌రాజు ప్రస్తుతం యండగండి పేరిష్ పాస్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో ఉండి మృతి చెందడంతో పేరిష్‌లోని యండగండి, ఉణుదుర్రు, సాగుపాడు, పాండువ్వ ఖండ్రిక లూథరన్ సంఘాలకు చెందిన క్రైస్తవులు, సంఘ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పాస్టర్ మృతికి సంతాపం తెలిపారు.యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణ మూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి జీ సుందర్‌కుమార్, పేరిష్‌డెలిగేట్ కే పేతురు, పాస్టర్ గోపే సాల్మన్‌రాజు,టీ ఆనందరాజు, ప్రసంగి తదితరులు తమ నివాళులర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: భీమవరంలోని చైతన్య ఆటో యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కాండ్రేకుల సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. అధ్యక్షుడిగా చెన్నంశెట్టి శ్రీనివాసు, కార్యదర్శిగా వీరవల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి జయకుమార్ విజయం సాధించారు.